క్లుప్తంగా

హామీలు అమలు చేయాల్సిందే..



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు లక్ష్మణమూర్తి

మల్కాపురం: ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని సీపీఎం మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఆ పార్టీ చేపట్టిన చైతన్యయాత్రను శనివారం 59వ వార్డు ఎక్స్‌సర్వీస్ మెన్‌కాలనీ కొండ ప్రాంతంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. చాలా మంది తమకు గ్యాస్ డబ్బులు పడలేదని వివరించారన్నారు. అలాగే కొండ ప్రాంతంలో వీధి లైట్లు సరిగ్గా వెలగడం లేదని, మెట్ల మార్గాలు అధ్వానంగా ఉన్నాయన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులకు టీ షర్ట్‌లు అందిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీ మైదానంలో విండ్‌బాల్ క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. క్రీడాకారులకు నాయకులు కలిదిండి బద్రీనాథ్, చంద్రమౌళి తదితరులు టీషర్ట్‌లు అందించారు. వారు మాట్లాడుతూ ఉగాది పురస్కరించుకుని ఇక్కడ ఐపీఎల్ మాదిరిగా విండ్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి సుమారు 100 జట్లు తలపడనున్నట్టు తెలిపారు.

ఉపాధి భద్రత కల్పించాలని వినతి



ఈపీడీసీఎల్ ఏడీకి వినతి ఇస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

మల్కాపురం: తమ ఉపాధికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు మల్కాపురం ఉప విద్యుత్ కేంద్రం ఏడీ మాధవికి ఆమె కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేశారు. మల్కాపురం, శ్రీహరిపురం సబ్ స్టేషన్లలో సుమారు 20 మంది విద్యుత్ మీటర్ల రీడర్లుగా 20 ఏళ్లుగా పని చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తమకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. తమ ఉపాధికి భద్రత కల్పించాలని కోరారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

గాజువాక: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గాజువాక పారిశ్రామిక ప్రాంత క్రైస్తవుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పాతగాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐక్య వేదిక ప్రతినిధులు రెవరెండ్ అద్దేపల్లి రవిబాబు, బిషప్ ఎల్.శామ్యూల్, పుచ్చ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి ప్రమాదంగా అనిపించడంలేదని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ సంఘటన అత్యంత బాధాకరమని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా కొంతమంది అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాలను ప్రణాళిక ప్రకారం హత్య చేశారని క్రైస్తవ సమాజం అనుమానం వ్యక్తం చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఎల్.ఆర్.బి ల్లీగ్రహం, ప్రభాకర్, ధనరాజు, డేవిడ్‌రాజు, సుభాకర్, అశోక్‌బాబు, విజయదాస్, ఆనంద్ కుమార్, ఎస్.బి.సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

ఆరిలోవ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శనివారం ఆరిలోవ ప్రాంతంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆరిలోవలో పలు చోట్ల బస్ స్టాప్‌లు, ఆటోలు, సిటీ బస్‌ల్లో ప్రయాణికులకు కరపత్రాలు అందజేశారు. తోటగరువు వద్ద ప్లకార్డులు ప్రదర్శించి, స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికులను కొనసాగించాలని, కార్మిక ఉద్యోగులకు బకాయి పడిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి కోసం ఏప్రిల్ 1న జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గాంధీ పార్కు వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నత్తేనయం!

కొన.. సాగుతున్న ఆర్‌వోబీ పనులు

ఎన్ఏడీ ప్రాంతంలో వాహనాల రద్దీని నియంత్రించడానికి చేపట్టిన ఆర్‌వోబీ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. మూడడుగుల ముందుకు.. ఆరడగులు వెనక్కి అన్నచందంగా పనులు సాగుతున్నాయి. నగరంలోనే రద్దీగా ఉండే కూడలిలో పనులు జాప్యంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

- ఎన్ఏడీ వద్ద రూ.28 కోట్లతో ఆర్‌వోబీ నిర్మాణం
- వీఎంఆర్‌డీఏ అధికారుల పర్యవేక్షణ శూన్యం
- కమిషనర్ హెచ్చరించినా కానరాని పురోగతి
- తరచూ ప్రమాదాలు, వాహనాల చోదకులకు ఇబ్బందులు



హైవేపై ప్రమాదభరితంగా ఉన్న ఇనుప చువ్వలు



ఆర్‌వోబీ పనులతో ఇరుగ్గా ఉన్న హైవేపై వాహనాల రాకపోకలు

విశాఖ విద్య: ఎన్ఏడీ వద్ద చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. పిల్లర్లు పూర్తి చేసి శ్లాబ్ దశలో పనులు నిలిపివేశారు. నిత్యం రద్దీగా ఉంటే ఎన్ఏడీ సెంటర్‌లో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఆర్‌వోబీ పనులు చూసిన వారంతా వీటికంటే నత్తే నయమంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పనులకు ప్రాధాన్యం ఇచ్చింది. నిధులు కేటాయింపులు చేసినా ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

కమిషనర్ ఆదేశించినా..

ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా గాజువాక వైపు ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టారు. ఇక్కడ రహదారి ఇరుగ్గా ఉన్నందున హైవేపై వాహనాల రాకపోకలకు సౌలభ్యంగా ఉండేలా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.28 కోట్లు నిధులు కేటాయించారు. పనులు మాత్రం ముందుకుసాగడం లేదు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ గత నవంబర్‌లో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబర్ నెలాఖరుకు దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కానీ, వీఎంఆర్‌డీఏ అధికారుల్లో మాత్రం చలనం లేదని ప్రస్తుతం ఈ పనులు చూస్తే అర్థమవుతోంది.



ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న ఆర్‌వోబీ

ఎందుకంత నిర్లక్ష్యం ?

ఎన్ఏడీ వద్ద ఆర్‌వోబీ పనుల కారణంగా గాజువాక వైపు వెళ్లే దారిలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. ఫలితంగా ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌వోబీ నిర్మాణ పనుల కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతుండటంతో పాటు నిర్మాణ సామగ్రి కూడా రోడ్డు పైనే పడేస్తున్నారు. దీని వల్ల గాజువాక వైపు నుంచి వచ్చే భారీ వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది.

పట్టించుకునేవారేరీ

ఎన్ఏడీ వద్ద ఆర్‌వోబీ నిర్మాణ పనులపై గతంలో వీఎంఆర్‌డీఏ అధికారుల సమీక్ష ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల పురోగతిని పట్టించుకునే వారే కరువవయ్యారు. దీంతో నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తికమక

ఆర్‌వోబీ పనులు చేపట్టే మూల మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డుల లేకపోవడంతో వాహనదారులు తికమకపడుతున్నారు. గాజువాక నుంచి వాహనాలపై వచ్చే వారు ఫ్లై ఓవర్ కింద దారికి వచ్చే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ మలుపు వద్ద వెనుక వచ్చే వాహనాలు కంట్రోల్ లేకపోతే ప్రమాదాలు జరుగటం ఖాయమని వాహనచోదకులు అంటున్నారు. అయినప్పటికీ వీఎంఆర్‌డీఏ అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా ఫ్లై ఓవర్ కిందకు వచ్చే దారి

వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' ఉద్యోగులు, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా పైడిరాజు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా చుక్కా పైడిరాజు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

12న హనుమాన్ శోభాయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమేష్ తదితరులు

విశాఖ విద్య: హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న చేపట్టనున్న హనుమాన్ శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ కోరారు. శుక్రవారం ఎన్ఏడీలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పెందుర్తి నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ కరాస, మర్రిపాలెం ,కంచరపాలెం, అక్కయ్య పాలెం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ సంపత్ వినాయక టెంపుల్, వుడా పార్క్, ఆర్కే బీచ్ వరకూ యాత్ర సాగించి అక్కడ హనుమాన్ హారతి కార్యక్రమంతో యాత్ర ముగింపు ఉంటుందన్నారు. రూట్ మ్యాప్, దీనిలో పాల్గొనే వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. కార్యక్రమంలో పలు సంఘాల పెద్దలు అప్పలరాజు, వెంకటేశ్వరరావు, కేశవ, గణేష్, నర్సింగరావు, వినయ్ మహంతి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ సుందరం దాతృత్వం



గర్భిణిని కేజీహెచ్‌కు తీసుకు వెళ్లిన సుందరం

గోపాలపట్నం: ఎవరికైనా అనారోగ్యం వస్తే 108కి కాల్ చేస్తారు.. ఆ ప్రాంతంలో మాత్రం విభిన్నం. గర్భిణి ఆస్పత్రికి వెళ్లాలంటే సుందరానికే ఫోన్ చేస్తారు. అవునండి మీరు చదువుతున్నది నిజమే..తన తండ్రి నడిచిన బాటలోనే తమ ప్రాంతంలోని గర్భిణులను ఆస్పత్రులకు ఉచితంగా తీసుకువెళ్తారు. గోపాలపట్నం ఇందిరానగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఆయనకు అంత పేరుంది. ఇది ఆయన తండ్రి ప్రకాష్ నుంచి వారసత్వంగా పొందాడు. కొత్తపాలేనికి చెందిన వాసి రాజేశ్వరి గర్భవతి కావడంతో ఆస్పత్రికి తీసుకు వెళ్లాలని ఫోన్ రావడంతోనే ఆమెను కేజీహెచ్‌కు తీసుకు వెళ్లి గైనిక్ వార్డులో చేర్పించాడు. 25 ఏళ్లుగా ఇటువంటి సేవలు అందిస్తున్నానని సుందరం తెలిపారు.

వైభవంగా నూకాంబిక పండగ

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారి సన్నిధిలో జియ్యాని శ్రీధర్ దంపతులు



ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రౌతు అప్పారావు



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



అమ్మవారిని దర్శించుకుంటున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతవాసుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి పండగ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, క్యూలైన్లలో ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త మళ్ల సతీష్, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు ఎండ దెబ్బ తగలకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానికులు భక్తులకు శీతల పానీయాలు మజ్జిగ, మంచినీరు, పులిహోర ప్రసాదాలు అందించారు.

పరసలో సందడి

సాయంత్రం పరసలో భక్తులు, స్థానికులతో సందడి నెలకొంది. స్టాళ్లలో ఏర్పాటు చేసిన వస్తువుల కొనుగోళ్లతో రద్దీగా మారింది. సప్తగిరి జంక్షన్ నుంచి గోపాలపట్నం వరకు ఏర్పాటు చేసిన నాలుగు స్టేజీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

అమ్మవారిని పలువురు నాయకులు దర్శించుకున్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘటాలతో ఊరేగింపు

మల్కాపురం: కొత్త అమావాస్య సందర్భంగా మల్కాపురం వద్ద కొలువుదీరిన నూకాలమ్మ తల్లికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని వేప, మామిడి ఆకులతో పాటు పుష్పాలతో అలంకరించారు. ఉదయం 6 గంటలకు స్థానిక భక్తులు ఘటాలను తలపై పెట్టుకుని వీధుల్లో ఊరేగించిన అనంతరం, ఆ ఘటాలను తిరిగి మందిరం వద్ద ఉంచారు. అనంతరం అమ్మవారికి అన్నం, పప్పుతో నైవేద్యాన్ని నివేదించారు. మధ్యాహ్నం పలువురు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

➡ 59వ వార్డు నక్కవానిపాలెం, పాత చెక్‌పోస్టు ఏరియా వద్ద గల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.అమ్మవారిని మేళతాళాల నడుమ ఊరేగించారు. పాత్‌చెక్‌పోస్టు ఏరియా ప్రాంత వాసులు, పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి అమ్మవారి అనుపు మహోత్సవాలు మేళతాళాలు, నేల డ్యాన్సులు, మందుగుండు సామగ్రితో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సతీసమేతంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

➡ హిందూస్థాన్ షిప్‌యార్డ్‌కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ఘనంగా నిర్వహించారు. గాంధీగ్రామ్ రెల్లి కుల సంక్షేమ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా రౌతు అప్పారావు పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు ఎస్.సురేష్, రౌతుబాబు, ధనాల సోమేశ్వరరావు, బొందల కిషోర్, అరుగుల శ్రీను, ధనాల రామారావు, మర్రాడు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం విస్తరించాలి

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ ప్రాంతంలో జీవీఎంసీ నిధులతో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని మరింత విస్తరించాలని ఆ ప్రాంత బీఆర్ అంబేడ్కర్ సేవాసంఘం ప్రతినిధులు ప్రభుత్వ విప్ గణపబాబును కోరారు. ఈ మేరకు ఆయన నివాసం వద్ద కలిసి, వినతిపత్రం సమర్పించారు. సుమారు రూ.20లక్షలతో సామాజిక భవనాన్ని నిర్మించారని, దీని ముందుభాగం సుమారు 20 అడుగుల మేర పెంచి, నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మించిన భవనం చిన్నదిగా ఉండటంతో సమావేశాలు, శుభకార్యాలు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. భవనాన్ని విస్తరించాలని కోరారు. సంఘం ప్రతినిధులు ఎం.పెంటారావు, విజయ్‌కుమార్, నడిపూరు రమణ, టి.సంపత్, ఎ.చంటి, కె.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ నాటకోత్సవాలు

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజులుగా నిర్వహించిన విశాఖ జాతీయ నాటకోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు మలయాళ నాటకం ద టైగర్ మ్యాన్‌ను ముఖ్య అతిథులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ మహాకవి గురజాడ రాసిన కన్యాశుల్కం సమాజాన్ని జాగృతం చేసిందన్నారు. కళలు, నాటకాలను ప్రోత్సహించడానికి రైటర్స్ అకాడమీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ విశాఖలో జాతీయ నాటకోత్సవాలు నిర్వహించి, సామాజిక సమస్యలపై స్పందించడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, రఘురామ కృష్ణంరాజులు నటనతో మెప్పించి కళల ప్రాధాన్యాన్ని తెలియజేశారన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, ప్రముఖులు నాంచారయ్య, చలసాని కృష్ణప్రసాద్, ఫణిస్వామి, కె.వెంకటేశ్వరరావు, మేడ మస్తాన్‌రెడ్డి, ఆడిటర్ ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



టైగర్ మ్యాన్ నాటకంలోని ఓ సన్నివేశం

ఆలోచింపజేసిన 'ద టైగర్ మ్యాన్'

కేరళకు చెందిన మలయాళ దర్శకులు హిస్నం టోంబో దర్శకత్వం వహించిన 'ద టైగర్ మ్యాన్' నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. గిరిజన గ్రామాల్లోని ప్రజల జీవనాన్ని, పేదరికాన్ని కళ్లకు కట్టినట్లు నటీనటులు ప్రదర్శించారు. 32 మంది కళాకారులు చక్కగా నటించి ప్రేక్షకులను కంటతడి పెట్టించారు.

➡ లీడర్ జాతీయ నాటకోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం కళాభారతి వేదికపై చిన్నారి రియాన్స్ ప్రహ్లాదుని ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సెకండ్ క్లాస్ చదువుతున్న ఏడేళ్ల రియాన్స్ భక్త ప్రహ్లాదుడి పాత్రలో ఓం నమో నారాయణ అంటూ ఆలపించిన గానం నాటి భక్తప్రహ్లాద చిత్రాన్ని గుర్తుచేసింది.

2న మున్సిపల్ కార్మికుల మహా ప్రదర్శన

అగనంపూడి: ఆప్కాస్‌ను రద్దు చేసే పక్షంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఉరుకూటి రాజు, రాము డిమాండ్ చేశారు. మరణించిన కార్మికులు, 60 ఏళ్లు దాటిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 2వ తేదీన చేపట్టనున్న మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం 79, 85 వార్డుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. రెండో తేదీ ఉదయం 10.30 గంటలకు రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ పార్క్ వరకు నిర్వహించనున్న మహా ప్రదర్శనలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సూరిబాబు, సత్యనారాయణ, మీనాక్షి, దేవి, సత్యవతి, బాలరాజు, శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

1 నుంచి ఉక్కు ఆస్పత్రి వైద్య సేవల్లో మార్పులు

ఉక్కునగరం: వచ్చే నెల 1 నుంచి ఉక్కు జనరల్ ఆస్పత్రికి అనుబంధంగా అందిస్తున్న సేవల్లో కొన్ని మార్పులు చేశారు. సిబ్బంది కొరత కారణంగా ఆదివారం, సెలవుల్లో మినహా ఓహెచ్ఆర్‌సీ, ఈఎంసీయూ–1 జనరల్ షిఫ్ట్‌లో మాత్రమే నడుస్తాయి. కేవలం ఈఎంసీయూ–2 మాత్రమే నిరంతరం సేవలు అందించనుంది. ఆదివారం, సెలవు దినాల్లో వైద్య సేవలు అవసరం అయిన వారు ఈఎంసీయూ–2ను వినియోగించాలని ఉక్కు ఆస్పత్రి అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.